# మరదలు పిల్ల

నల్లని మేఘాలు ఆకాశంలో నలుమూలలా వ్యాపించి చిన్న చినుకులు ప్రారంభించాయి. సందు మలుపు తిరిగి మెయిన్ రోడ్డు మీదకు వచ్చి టైమ్ చూసాను. ఇంకా పది నిముషాలుంది లాస్టు బస్సుకు.పది నిమిషాలలో నేను ఫర్లాంగు దూరంలో నున్న బస్సు స్టాప్ చేరుకోవాలి. లేకుంటే లాస్టు బస్సు కూడా అందదు. నాలుగు మైళ్ళు యీ వర్షంలో కాళ్ళీడ్చుకుంటూ పోవాలి ఇల్లు చేరుకోవడానికి. ఈ ఆలోచన రాగానే నా హృదయ వేగం హెచ్చింది. కూడా నానడక వేగం హెచ్చింది. అదృష్టవశాత్తు బస్సురాకకు ముందుగానే గమ్యస్థానం చేరుకోగలిగాను.

నా కన్నా ముందుగా వచ్చి బస్సు స్టాపులో నిల్చున్న అమ్మాయి మీద పడింది, నాదృష్టి. గులాబీ రంగు జార్జెట్ చీర, లేడీ షూ, చేతికి బంగారు గొలుసు వాచి, చేతిలో చిన్న హేండ్‌బేగ్, అంతా అప్టుడేట్ ఫేషన్‌లోవుంది. కాని ఆమెను చూడగానే ఎవరైనా ఆంధ్ర మహిళ అని అనుకోక మానరు. ఆమె వైపు చూస్తూ పరధ్యానంగా నిలుచునేసరికి బస్సు హారన్ వినిపించింది. ప్రక్కనే ఆగిన బస్సులో ఎక్కాను. ఆమె కూడా ఎక్కినా ఎదురుగా వున్న సీట్లో కూర్చుంది. బస్సులో అందరి కళ్ళను ఆమె అందం ఆకర్షించింది.

"టికెట్ సార్ టికెట్" అంటూ కండక్టరు నా దగ్గరకు వచ్చాడు.

నేను అర్ధరూపాయ తీసి వాడికిచ్చాను. వాడు మా యిద్దరి ప్రక్క అదోలా చూసి రెండు టిక్కెట్లు చించి నా చేతిలో వుంచి చక్కా పోయాడు.

నేను చాలా ఆశ్చర్యపోయాను. బహుశా ఆమె నేను ఒకచోట ఎక్కాము కనుక ఆమె నా తాలూకు మనిషనుకున్నాడు కండక్టరు. పోనీ కండక్టరుని పిలిచి చెప్పాలనుకున్నా. కాని అభిమానం వెనుకంజ వేసింది. "ఒక పావలా కోసం కక్కుర్తి ఏంటిలే" అనుకున్నా. అందులో ఆ రోజు ఒకటో తారీఖు జీతం డబ్బు ఏడువందలు జేబులో వున్నాయి.

మాట్లాడకుండా వూరుకున్నాను.

నేను దిగాల్సిన స్టాపు రాగానే లేచాను దిగడానికి. కాని ఆమె నా కన్నా తొందరగా దిగి ముందుకు నడవసాగింది.

ఇదేమిటి యీ ప్రాంతంలో (నేను తప్ప) మరెవరూ ఆంధ్రులు లేరుకదా యీమెకు యిక్కడ ఏంటి పని అనుకున్నా.

ఆమె ఎక్కడికి వెళుతుందో ఆమె వెంట వెళ్ళిచూస్తే? ఆమెను నేను వెంటాడుతున్నానని ఆమె రిపోర్టిస్తే నాకు దేహశుద్ధి తప్పదు. అయినా ఇంత వర్షంలోనా? అప్పటికే ఇంచుమించు పూర్తిగా తడిసిపోయాను.

ఆమె గబగబ అడుగులు వేసుకుంటూ మా యింటి మీదుగా మరి రెండు మూడు యిళ్ళుదాటి వెళ్ళింది. నేను మా గుమ్మం ముందు నిల్చుని ఆమె వెళ్ళిన వేపు ఒక మారు చూసి తలుపు తాళం తీసాను.

"మిస్టర్!" వెనుక ఎవరో పిలిచారు.

నన్నేనా పిలుస్తున్నది. నన్ను కాదేమో అనుకుంటూ వెనుతిరిగాను.

ఆమెకోసం ఇందాకా బస్సులో ఇచ్చిన ఛార్జీ తిరిగి యిచ్చివేస్తుందేమో అనుకున్నాను.

"పరవాలేదు లెండి పావలా కోసం" అందామనుకున్నాను.

కాని ఆమె చిన్న కాగితం తీసి నాచేతి కిచ్చింది. నేను ఆశ్చర్యపోయాను.

నీలవేణి, మా ఆవిడపేరు దిగువ నా ఎడ్రస్సుంది.

"ఈ ఎడ్రసునాదే. నీలవేణీ నామిసెస్ మీరు!" అన్నాను ఇంకా ఆశ్చర్యపోతూ.

"నా పేరు మిస్ "లవలి" నీలవేణి నా కజిన్ సిస్టర్" అంది.

నీలవేణికి నాకు పెళ్ళయి నాలుగు నెలలే అయింది. నాకు శలవులేకపోవడం వల్ల, పెళ్ళయిన వెంటనే మేం ఇక్కడకు వచ్చేయడం చేత నీలవేణి తన బంధువులను నాకు పరిచయం చేయలేకపోయింది.

"లోపలకు రండి" అంటూ తలుపు గొళ్ళెంతీసి రూములో ప్రవేశించాను.

ఆమెకూడా నా వెంటే లోనికి వచ్చింది.

"కూర్చోండి" అంటూ కుర్చీ చూపించాను.

ఆమె కూర్చుంది.

"నేను హైదరాబాద్‌లో పనిచేస్తున్నా, మా బ్రదర్ తిరుపతిలో వున్నాడు. వాడిని చూద్దామని వచ్చాను. ఎల్లాను యింతదూరం వచ్చాను కదా నీలవేణిని కూడా ఒక మారు చూసిపోదామని వచ్చాను. మేరేజికి రాలేదని తిడుతూ నాలుగు తావుల వుత్తరం రాసింది. ఇంతవరకూ వచ్చి యిక్కడకు రాకుండా వుంటే యింక బ్రతకనిస్తుందా?" అంది.

"నీలవేణి వారం రోజుల క్రితం పుట్టింటికి వెళ్ళింది. అన్నాను."

"తలకాస్త తుడుచుకుంటారా? బాగా తడిసిపోయినట్లున్నారు" అంటూ టవల్ యిచ్చా.

"థాంక్సు" అంటూ ఆమె టవల్ తీసుకుని తల శుభ్రంగా తుడుచుకుంది.

నేను డ్రస్సు మార్చుకున్నాను ఉదయం ఫ్లాస్కులో పోసి వుంచిన కాఫీ రెండు కప్పులలో పోసి ఆమె కొకటి యిచ్చి నేనొకటి తీసుకున్నాను.

"మీకు నేను చాల శ్రమ కలిగిస్తున్నా" అందామె.

"అఁ! శ్రమేం వుందండీ? అయినా మా నీలవేణి వుంటే మీరాకకు ఎంత సంతోషించేదో?" అన్నాను.

ఆమె కాఫీ త్రాగడం పూర్తిచేసి కాళీ కప్పు టేబిల్‌మీద వుంచింది.

"ఇంక నేను వెళ్ళి వస్తానండీ" అంటూ లేచి నిల్చుంది.

"ఇంత వర్షంలో ఎక్కడికి వెళతారు. ఈ వూర్లో యింకెవరైనా రెలెటివ్స్ వున్నారా"

"ఎవరూ లేరండి. ఈ రాత్రికి ఏ వెయిటింగ్ రూమ్‌లోనో గడిపి వుదయం ఎక్స్‌ప్రెస్‌లో వెళ్ళిపోతాను"

"అదేమిటి వెయిటింగ్ రూమ్‌లోనా?! మీకు అభ్యంతరం లేకుంటే యిక్కడే వుండొచ్చు"

"మీకెందుకండీ అనవసరమైన యిబ్బంది."

"ఇబ్బందేముందండీ యిందులో. అందులోనూ మీరు పరాయివాళ్ళుకారుగా? ఏమైనా మీరు వెళ్లడానికి వీలులేదు" అన్నాను.

"మీరు చాల గట్టివారే" అంటూ మళ్ళీ కుర్చీలో కూర్చుంది.

"చీర మార్చుకుంటారా? బాగా తడిసి పోయినట్లుంది" అన్నాను.

"ఎట్లా యింకోటిలేదే?" అంది.

"నీలవేణిది వుందిగా మార్చుకోండి" అంటూ పెట్లోంచి చీర జాకెట్ తీసి యిచ్చాను.

ఆమె డ్రస్సు మార్చుకొని తడిచీర పిండి ఆరవేసుకొంది.

"ఇది పక్కటే గదా?"

"అవునండి దీనికే 100 రూపాయలు రెంటు"

భోజనం తెచ్చేకుర్రాడికి రెండు తీసుకురమ్మని చెప్పాను.

వాడు క్యారేజీ తెచ్చేవరకూ లవలి ఏవో కబుర్లు చెపుతూంది. నేను పరధ్యానంగా వింటున్నాను. "ఏమండీ! భోజనానికి లేద్దామా" అన్నాను.

"అదుగో మీరల్లా ఏమండీ అంటే నాకదోలా వుంది" బుంగమూతి పెట్టింది.

"సరేలే ఈ మాటునుంచీ అనను".

యిద్దరం నవ్వుకున్నాము.

నేను వడ్డిస్తుంటే నా చేతిలో గరిట తీసుకొని ఆమే వడ్డించింది.

ఇద్దరం ఏవో కబుర్లు చెప్పుకుంటూ భోజనం ముగించాము.

"ఈ బెడ్ మీకోసం" అంటూ టేబిల్ మీద వున్న రెండు మూడు పత్రికలు తీసి ఆమె ముందు పడవేశాను.

ప్రయాణ బడలిక వల్లకాబోలు ఆమె చాల త్వరగానే నిద్రపోయింది.

నేను పేపరు చదవడం ముగించి నా బెడ్‌మీదకి వెళదామని లేచాను.

ఆమె జారిపోయిన పైట కూడా సరిచేసుకోకుండా వెల్లకిలా పడుక్కొని నిద్ర పోతూంది.

ఆమె బెడ్‌కూ నా బెడ్‌కూ రెండడుగులే మధ్య దూరం. అంతకన్నా ఎక్కువ దూరం వుంచటానికి నా గదిలో చోటు లేదు. నేను నా బెడ్‌మీద కూర్చుని ఆమె అంగ సౌష్టవాలను తనివితీరా చూస్తున్నాను.

లేచి లైటార్పి పడుక్కుందామనుకున్నాను ఇంతలో పెద్ద మెరుపు మెరిసి దాని వెనుకనే పెద్ద వురుము వురిమింది చెవులు బ్రద్దలయ్యేట్లు. దాంతో ఒక్క మారు లైట్లు ఆరిపోయాయి.

లవలి త్రుళ్ళిపడి లేచి నన్ను గట్టిగా పట్టుకుంది.

వెంటనే లైట్లు మళ్ళా వెలిగాయి.

ఆమె నన్ను వదిలి దూరంగా జరిగి సిగ్గుతో తలవంచుకుంది.

"ఎక్కడో పిడుగు పడ్డట్టుంది" అన్నాను.

"మీరింకా నిద్రపోలేదా?" అంది.

"లేదు" అంటూ లైటు ఆర్పి వచ్చి పడుకున్నాను.

"బావగారూ నాకేదో భయంగా వుంది" అంటూ నావేపు జరిగింది.

ఆమె శరీరం నాకు తగలగానే నాలో విద్యుత్ ప్రవహించినట్టయింది.

ఒక్కక్షణంలో ఆమెను నా బాహువుల్లోకి లాక్కున్నాను. ఆమె నన్ను అభ్యంతర పర్చలేదు.

ఉదయం సూర్యరశ్మి నా ముఖం మీద కిటికీలోనుంచి పడేవరకూ నాకు తెలివి రాలేదు.

లేచి చూసేసరికి, నా ప్రక్క బెడ్ ఖాళీగా వుంది. "లవలి నాకన్నా ముందే లేచిందే" అనుకున్నాను. ఆమె కోసం గదంతా చూశాను. ఆమె కనుపించలేదు. వీధి తలుపులు బార్లా తెరిచి వున్నాయి వీధిలో కూడా ఆమె జాడలేదు. రాత్రి ఆమెకు కట్టుకుందుకు యిచ్చిన చీర స్టేండు మీద పడి వుంది, నేను వెంటనే గ్రహించాను.

"మరదలు పిల్ల" మాయ మయింది. కూడా టేబిల్ మీద వున్న నా రిస్టువాచీ, జేబులో వున్న పర్సు మాయమయ్యాయి.

నాకు ముచ్చెమటలు పోసాయి.

ఆఫీసులో గీత గోవిందానికి రాత్రి సంఘటన చెప్పాను. వాడుకూడా ముందు ఆశ్చర్యపోయాడు.

"నీవు కూడా దానివల్లో పడ్డావు. అది పక్కా గజదొంగ, అది ఎంతో మందినిల్లా మోసగించింది. ఇంతకూ ఏమాత్రం ముట్టచెప్పావు?"

"ఆఁ! ఎంతో లేదులే. అంతా కలిసి తొమ్మిది వందలుంటుంది" అంటూ వాడి

దగ్గర నుంచి కదిలాను.

"ఇప్పటికీ మా ఆవిడ నన్ను హెచ్చరిస్తుంది తను వూరు కెళ్ళేముందు.

"ఏమండోయ్! మరదలుపిల్ల వచ్చేను జాగ్రత్త?" అంటూ.

*ప్రజామత వీక్లీ 9.7.1963.*